# కథ

**పాలగుమ్మి రామకృష్ణారావు**

# మీరైతే ఏం చేస్తారు?

విష్ణుమూర్తి ఇలాంటి పరిస్థితి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. తన పిల్లలే తనముందు దోషులుగా నిలబడతారని కలలో కూడా అనుకోలేదు. సినిమాల్లో చూసేటప్పుడు ప్రేమ కథలు సరదాగానే ఉంటాయి. కానీ నిజ జీవితంలో ప్రవేశించినపుడు భయంకరమైన సునామీలను సృష్టిస్తాయి.

నిజానికి ఈ విషయం ఈ రోజైనా తెలిసేది కాదు, అమలాపురం నుండి పెళ్ళి సంబంధం రాకుంటే. విష్ణుమూర్తి భార్య లక్ష్మి కూడా ఈ సంగతి తెలిసిన తరువాత ప్రొద్దుట నుండి పచ్చి మంచినీళ్లు కూడా ముట్టుకోకుండా దిగాలుగా కూర్చుంది. “మనం పిల్లల్ని కనడం, పెంచడం ఇవన్నీ దండగ పనులండీ” అంది కళ్లనీళ్లు పెట్టుకుని.

విష్ణుమూర్తి తీవ్రంగా ఆలోచించాడు. “కులాలు, మతాలు, ఇవన్నీ ఈ రోజుల్లో ట్రాష్ అని కొట్టిపడేద్దాం లక్ష్మి. కానీ కట్నాలు, కానుకలు వీటిని ఎవరూ వదిలిపెట్టరు కదా?”

“శివరావుగారిది, మనది ఎదురెదురు కొంపలయ్యాయి. ఏం చెయ్యాలో నాకసలు తోచడం లేదు. ఈ విషయంలో మీరే ఏదో గట్టి నిర్ణయం తీసుకోవాలి. ఆ పార్వతమ్మతో నాకు అస్సలు పడదు. వాళ్ల ఇంట్లోకి మాత్రం నేను చచ్చినా అడుగుపెట్టను” లక్ష్మి ముక్కు చీదుతూ లోపలికి వెళ్లిపోయింది.

“కాదు అంటే ఈ పెళ్లి ఆగుతుందా? ఇల్లు వదిలిపెట్టయినా పెళ్లి చేసుకుంటారు.”

“అవును, అలాగే” అంటే వచ్చే లాభం ఏమిటి? విష్ణుమూర్తి ఎదురింటి వైపు చూస్తో ఆలోచనల్లో పడ్డాడు.

ఆ ఇంట్లో శివరావు, పార్వతి. ఈ ఇంట్లో విష్ణుమూర్తి, లక్ష్మి. అటు, ఇటు చెరో ఇద్దరు పిల్లలు. కాలేజీకి వెళ్లే పిల్లలు కలసి ఉంటారు కానీ పెద్దవాళ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది.

ఆడవాళ్ల మధ్య వీధికుళాయి, ఇళ్లముందు చెత్త, అంట్లు తోమేది, ఆకు కూరలు అమ్మేది తంపులు పెడితే, మగవాళ్ల మధ్య ఆఫీసు రాజకీయాలు అడ్డుగా నిలిచాయి. ఎటు కాకులటే వాలాలన్న సిద్ధాంతం వాళ్ల మధ్య బలంగా నాటుకుపోయింది.

ooo

ఆదివారం ఉదయం శివరావు వరండాలో వాలుకుర్చీలో కూర్చుని కాఫీ తాగుతూ పేపరు చదువుకుంటోంటే గేటు చప్పుడయింది. తలెత్తి చూసేటప్పటికే విష్ణుమూర్తి తలుపు తోసుకుంటూ “లోపలికి రావచ్చా బావగారు” అంటూ వచ్చాడు. శివరావు ఈ ఊహించని పరిణామానికి స్థాణువయ్యాడు. బావగారూ అనే పిలుపు మరోసారి వినపడ్డాకా ఈ లోకంలోకి వచ్చి ఏం మాట్లాడాలో తెలియని స్థితిలో “రండి, కూర్చోండి” అన్నాడు కుర్చీ చూపించి.

“మా చెల్లెమ్మ, అదే ఆవిడ ఇంట్లో ఉన్నారా?” కుర్చీ శివరావుకు దగ్గరగా లాగి కూర్చుంటూ మాటల్లో మరో అడుగు ముందుకేశాడు విష్ణుమూర్తి.

శివరావు అప్పటికి ఇంకా పూర్తిగా తేరుకోలేదు. తడబడుతూనే “ఏవే పార్వతీ విష్ణుమూర్తిగారొచ్చారు, ఓసారిలా వస్తావా?” అన్నాడు వంటింటికేసి చూస్తూ. ఈసారి ఆశ్చర్యం వంటింట్లో పార్వతమ్మ పక్కన చేరింది. ఆవిడ క్షణాల్లో కారణం వెతుకుతూ మొహంలో నాలుగైదు రంగులు మార్చింది.

విష్ణుమూర్తి మరో మాట కలిపాడు “ఇంట్లో పిల్లలు లేరా?” లేరని తెలిసే వేశాడు ఆ ప్రశ్న.

“ప్రైవేటుకని వెళ్లారండి” శివరావు మర్యాదకి సమాధానం చెప్పినా ‘తెలిసుండి ఎందుకడుగుతావు?’ అన్నట్లుగా ఉన్నాయి ఆయన ముఖ కవళికలు. పార్వతమ్మ వంటింట్లోంచి వస్తూ కాఫీ కప్పు కూడా పట్టుకొచ్చి “కాఫీ తీసుకోండి” అని అందించింది ఆయన ఆగమనానికి కారణ అన్వేషణలో విఫలమై.

విష్ణుమూర్తి థేంక్స్ చెప్పాడు. కాఫీ రెండు గుటకలు వేసి విషయం మొదలుపెట్టాడు. “మనం ఒక వీధిలో ఉండేవాళ్లం. ఎదురెదురు ఇళ్లవాళ్లం. మనమధ్య ఎన్ని విభేదాలున్నా ఇలాంటి పరిస్థితుల్లో సర్దుకుపోక తప్పదు”

“మీరు దేనిగురించి మాట్లాడుతున్నారో తెలియటం లేదు” పార్వతమ్మ విషయం నాన్చకుండా చెప్పమన్నట్లుగా అంది.

“అదేనమ్మా అది చెప్పడానికే వచ్చాను. ఒక్కోసారి మనం అనుకున్నవి అనుకున్నట్లుగా జరగవు. పిల్లల అభిప్రాయాలకు తలొంచవలసి వస్తుంది. మొదట్లో ఇది నేనూ నమ్మలేదు.”

“ఏది?” శివరావు బిత్తతల మొహం ప్రశ్నార్థకానికి జతయింది.

“మా అమ్మాయి సీత...”

“సీత?”

“మీ అబ్బాయి రామం ప్రేమించుకున్నారు.”

శివరావు దంపతులకు విషయం పూర్తిగా అర్థం అయిపోయింది. ‘నో’ గట్టిగా అరిచాడు శివరావు.

“మేం ఒప్పుకోం” అంతకంటే గట్టిగా నొక్కి వక్కాణించింది పార్వతమ్మ. విష్ణుమూర్తి మాత్రం కూల్‌గానే కూర్చున్నాడు.

“నిజమే బావగారు... ఈ పరిస్థితిలో ఎవరైనా ఇలాగే మాట్లాడతారు. కానీ పిల్లల సౌఖ్యాన్ని చూసుకునే బాధ్యత మనమీదుంది.”

శివరావు ఆల్మోస్ట్ బుద్ధ విగ్రహంలా మారిపోయాడు. ఇప్పుడు తను కల్పించుకోపోతే కొంప మునిగేలా ఉందని నిర్ణయించుకుని ఒక అడుగు ముందుకు వేసింది పార్వతమ్మ. “ఇలాంటి ప్రేమలు, దోమలు మా ఇంటా వంటా లేవు. మా రామం అలాంటివాడు కాదు. మీ అమ్మాయే ఏదో చేసింది. తగుదునమ్మా అని ఈ రాయబారం నడపడానికి పొద్దున్నే వచ్చారా మా ఇంటికి? చాల్లెండి. ఇంకా ఏదో అనుకున్నాను. ఈడొచ్చిన మగపిల్లలు ఇంట్లో ఉంటే ఎక్కడెక్కడివాళ్లూ వెంటబడతారు. మీ అమ్మాయిని కంట్రోల్లో పెట్టుకొండి. ఇంక మీరు వెళ్లొచ్చు” అంటూ వ్యవహారానికి నాలుగు మాటల్లో కటీఫ్ చెప్పింది.

విష్ణుమూర్తి సహనాన్ని వదిలిపెట్టలేదు. “శివరావుగారూ నేను చెప్పింది నిజం. పిల్లల మధ్య ప్రేమ అబద్ధం కాదు. కట్నకానుకలు లేకుండా తేలిగ్గా ఒక మగపిల్లవాడ్ని ఎగరేసుకుపోయే కుట్ర అంతకన్నా కాదు. మన పిల్లలు చదువుకునేది ఒకే కాలేజీ, ఒకే క్లాసు కూడా. వాళ్ల భవిష్యత్‌కు మీరెంత ఖర్చుపెట్టారో నేనూ అంతే ఖర్చుపెట్టాను. మనదేముంది... ఒక్క క్షణంలో స్నేహాన్ని పెంచుకోగలం. తెంచుకోగలం. వాళ్లలా కాదండి. మనం పెద్ద మనసుతో ఆలోచిస్తే వాళ్ల జీవితాలు బాగుంటాయి.”

శివరావుకొన్ని క్షణాలు ఆలోచించాడు. ఆ తరువాత భార్య మొహంలోకి చూశాడు. పార్వతమ్మ చూపులోను, ఆలోచనలోను మార్పు లేదు. నొప్పించక, తానొవ్వక అన్నట్లుగా స్థితప్రజ్ఞుడిలా చెప్పడం మొదలుపెట్టాడు. “వాడి మీద మేం ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. వాడ్ని ఇంకా పై చదువులు చదివించాలనుకుంటున్నాం. విదేశాలకు కూడా పంపాలనుకుంటున్నాం. ఈ పరిస్థితుల్లో ఏదో తెలివి తక్కువగా ప్రేమించాడని పెళ్లి చెయ్యలేం కదా.”

“మా తాహతుకు తగ్గట్టుగా మీ అబ్బాయి చదువుకు మేమూ సహాయం చెయ్యొచ్చు కదా?”

పార్వతమ్మ ఒక్క ఊపులో బదులిచ్చింది. “ఏం ఇవ్వగలరండి మీరు? లక్షో, రెండు లక్షలో చేతిలో పెడతారు. ఈ చదువైపోతే వాడే సంపాదిస్తాడు నెలకో లక్ష.”

తెలియకుండానే వ్యవహారం ముందుకు నడుస్తోన్నందుకు విష్ణుమూర్తి సంతోషించాడు. "నన్నేం చెయ్యమంటావు చెల్లమ్మా. మీ అభిప్రాయం ఏవిటో ఖచ్చితంగా చెప్పండి. నాకు చేతనైనంతవరకు కాదనను. ఆలోచించండి. మీకూ ఒక ఆడపిల్ల ఉంది."


"మా వాడికి పదేసి లక్షలిస్తామంటూ సంబంధాలొస్తున్నాయి. అదేం మేం పట్టుకుపోయేది కాదు వాడి చదువుకే" సంబంధాలెప్పుడొచ్చాయో తెలియక శివరావుకు బుర్ర తిరిగింది. భార్యకున్న తెలివి తనకు లేనందుకు ఒకింత సిగ్గుపడ్డాడు కూడా.

"మీ మాట నేను కాదనడం లేదు. కానీ నా పరిస్థితి కూడా ఆలోచించండి. రామం తెలివైన వాడే. బాగా సంపాదించగలడు. అలాంటప్పుడు ఈ కట్నాలు అంత ముఖ్యం అంటారా?"

"కట్నాలంటూ ముద్ర వెయ్యకండి. నిజంగా ఇచ్చేవాళ్లు ఎవరూ అలా మాట్లాడరు. ఏదో వాడి చదువుకని అంటున్నాం. మీకు ఆ తాహతు లేదని మాకు తెలుసు" పార్వతమ్మ కూరగాయల వాడి దగ్గర ఎంత ఖచ్చితంగా మాట్లాడుతోందో అలాగే తెగేసి చెప్పింది.

"మీ అభిప్రాయం ఏవిటి బావగారు? కాళ్ల దగ్గరకు వచ్చిన సంబంధం కాశీ వెళ్లినా దొరకదంటారు. మనలో మనం సర్దుకుపోవడం అంత కష్టమేం కాదు. కావాలనుకుంటే మా అమ్మాయి చేత కూడా ఉద్యోగం చేయించుకోవచ్చు."

శివరావు ఈసారి భార్య మొహంలోకి చూడకుండానే సమాధానం చెప్పాడు. "మా ఇద్దరి అభిప్రాయాలు ఒకటేనండి. మీరు తెలిసున్న వాళ్లు కదాని ఇంత వరకు మాట్లాడాం. మా ఆవిడ చెప్పినట్లు మీకు శక్తి ఉంటే ఆలోచిద్దాం."



విష్ణుమూర్తి కుర్చీలోంచి లేచి వరండా మెట్లు దిగాడు. వెనక్కు తిరిగి 'చెల్లమ్మా' అన్నాడు.

"మావారు చెప్పారు కదా అన్నయ్యగారూ. ఇక ఇంటికెళ్లి ఆలోచించుకోవలసింది మీరు" చెల్లమ్మా అన్న పిలుపునకు అన్నయ్యగారూ అని సాగదీసి సమాధానం ఇచ్చింది పార్వతమ్మ.

విష్ణుమూర్తి గేటువరకు నడిచాడు. గేటు రెక్క తీసి మళ్లీ వెనక్కు తిరిగి వరండా వరకు వచ్చి ఆగాడు. మళ్లీ ఏం చెప్పడానికొచ్చాడా అన్నట్లు చూశారు భార్యాభర్తలు.

"శివరావుగారూ, ఇందాకా నేను చెప్పినదాంట్లో చిన్న మార్పుంది. మన పిల్లల ప్రేమ విషయం మీకు ముందు తెలుసుంటే మీరే ఈపాటికి మా ఇంటికి వచ్చేవారు. ఇంతకుముందు నేను చెప్పినట్లుగా మా అమ్మాయి సీత, మీ అబ్బాయి రామం ప్రేమించుకోలేదు. మా అబ్బాయి సందీపు, మీ అమ్మాయి సౌందర్య ప్రేమించుకున్నారు. ఇలాంటి సందర్భాలలో కట్నకానుకలు గురించి ఎలా మాట్లాడుకోవాలో తెలియక ఇదే మీదైతే ఏం చేస్తారో తెలుసుకోవాలని చిన్న మార్పు చేసి చెప్పానంతే. మా సందీపు విషయంలోనూ మా అభిప్రాయం అంతే. ఇప్పుడు ఆలోచించుకోవలసింది మీరే" విష్ణుమూర్తి మరో మాటకై ఎదురుచూడకుండా, ఒక తెరిచిన గేట్లోంచి మరో తెరిచిన గేట్లోకి వెళ్లి తలుపేసుకున్నాడు.

ఆ ఇంటికి ఈ ఇంటికి మధ్యదూరం ఎంత? అంటే అడుగు బద్దతో కాదు ఇప్పుడు కొలవవలసింది, నిండు మనసుతో.

○